ఓం శ్రీసాయిరాం

పాప భయంబు పోయె పరిపాటయిపోయెను దుష్కృతంబిలన్
శ్రీపతి భక్తిపోయె వివరింపగ లేని దురంత కృత్యముల్
దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడైన ఆ
శ్రీపతి నామచింతనయె చేకురజేయు సుఖంబు మానవా!

భక్తిరేవ పరమార్థదాయిని భక్తిరేవ భవరోగనాశని
భక్తిరేవ పరవేదనప్రదా భక్తిరేవ పరమోక్షకారిణి.

ప్రేమస్వరూపులారా!

పరమార్థ మార్గమునకు భగవంతుని భక్తియే ప్రధాన రాజమార్గము. జననమరణాది రోగములకు ప్రాకృతమైన జీవిత చింతనలకు నివారణ గావించే దివ్య ఔషధమే భగవద్భక్తి. భక్తికి మించిన మరొక మార్గము, పరతత్త్వము బోధించే మరొక మార్గము ఈ జగత్తునందు కానరాదు. ప్రాచీనకాలమునుండి భారతీయ సంస్కృతియందు ఉపనిషత్తులే ప్రధానమైన వేదాంతముగా ప్రబోధించి, ప్రచారము సల్పిన దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన దేశము ఈ భారతదేశము. ఈ ఉపనిషత్తునందు, 'ఈశావాస్యమిదం సర్వం' ఈయొక్క మంత్రము భారతీయుని హృదయమందు పరిపూర్ణ విశ్వాసముతో నిల్పుకున్నప్పుడు భారతదేశమునకు ఎట్టి బాధలు సంభవించవు. సర్వత్రా వుండినది దైవమే అనే సంకల్పము విశ్వసించిన మానవునకు ఎట్టి బాధలు చెంత చేరవు. ఉపనిషత్తులు 'తత్ త్వం అసి' అది నేనే అయి వున్నాను, అనే సత్యము భక్తుని హృదయమందు పాదుకొని పోవాలి. 'అహం బ్రహ్మాస్మి' నేనే బ్రహ్మనై వున్నాను, అనే సత్యమైన పలుకు మానవుని హృదయములో చిరస్థాయిగా నిల్చిపోవాలి. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఎక్కడ చూచినా బ్రహ్మముయొక్క భావమే ఈ జగత్తునందు ఆవరించినది. 'అయమాత్మాబ్రహ్మ' ఇదియే తురీయ స్థితి. దీనినే ఓంకార శబ్దముతో పోల్చారు. ఈ ఓంకారమునకు ఒక స్పెల్లింగు వుంటున్నది. అ ఉ మ్. ఈ మూడు అక్షరముల చేరికయే ఓం. దీనినే మహామంత్రముగా ఆనాటి మహర్షులు దివ్యమైన త్రేతాయుగమందు ఈ జగత్తునకు ప్రబోధిస్తూ వచ్చారు. అ లక్ష్మణుడు, ఉ భరతుడు, మ శత్రుఘ్నుడు. ఈ మూడింటి ఏకత్వమైన ఓం రాముడు. ఈ మూడింటి ఏకత్వముతో కూడినదే ఆత్మారామమ్. ఇదియే ఉపనిషత్తులు, 'రమయతీతి రామ' అనింది. ఆత్మతత్త్వమే రమింపబడేది. ఈ నామము సంఖ్యాశాస్త్రముతో మనము చక్కగా విచారణ చేసినప్పుడు అంతరార్థము అర్థమవుతుంది. నామం, నాఅమ . సంఖ్యాశాస్త్రములో నా 0, అ 2, మ 5. 0,2,5 మొత్తము 7.సప్తస్వరములే రామనామ తత్త్వము. నామము సప్తస్వరములను బోధిస్తున్నాది. సప్తవర్ణములను బోధిస్తున్నాది. సప్తాహం ఏడు దినములు మాత్రమే చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటి? నామము సప్తాహముచేత, సప్తఋషుల భావముచేత, సప్తవర్ణములచేత, సప్తధ్వనులచేత ఈ జగత్తు నిండివుంటున్నది. ఇవే స,రి,గ,మ,ప,ద,ని ఏడు. ఈ ఏడు అక్షరములందే సర్వభావములు యిమిడి వుంటున్నాయి. వీటినే సప్తస్వరములని పిలుస్తూ వచ్చారు.

శబ్దబ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానందమయీ పరాత్పరమయీ.......

సప్తస్వరములచేత కూడినది పరాత్పరమయి. రామ, రా 2, మ 5, రెండూ చేరితే 7 నెంబరు. కనుక, రామనామ సప్తాహము జరుపుతామని ప్రపంచములో చెబుతుంటారు. ఏడు అనేది భగవత్స్వరూపముతో కూడిన సప్తస్వరములే! ఈ నామము ఎందుకోసం మనం ఉచ్చరించాలి? ఎంధుకు మనం ప్రార్థన చేయాలి? ఈ విశాల ప్రపంచమును సృష్టించి, అనంతమైన ఈ జగత్తునందు అనేక జీవరాసులను సృష్టించి, ఈ జీవరాసులకు వినియోగ పదార్థములను సృష్టించి, తినుటకు తిండి, పీల్చుటకు గాలి, త్రాగుటకు నీర, సర్వవిధములైన పదార్థములు సమకూర్చిన భగవంతునకు కొంత కృతజ్ఞత చెప్పనక్కరలేదా! నీ కర్చీఫ్ క్రిందపడినప్పుడు ఎవరైనా తీసి చేతికి యిస్తే 'థాంక్స్' అంటావు. మానవునకు సమస్త పదార్థములను సమకూర్చి అందించిన భగవంతునికి 'థాంక్స్' చెప్పనక్కరలేదా? ఆ కృతజ్ఞతయే ప్రార్థన. మానవునియందు అంతర్భూతమై, అగోచరమై, అప్రమాణమై, అతీతమైన దివ్యశక్తిని మేల్కొల్పుటయే ప్రార్థన. దీనినే ఉపనిషత్తులు 'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధిత' అన్నాయి. లెమ్ము! లెమ్ము! అజ్ఞాన నిద్రనుండి మేల్కొనుము. నీవు ఆనంద పిపాసి. నీ జీవితమంతా ఆనందమయమే. ఎక్కడ చూచినా ఆనందమే! నీ జీవితమే ఆనందమై వుండగా ఆనందమును వెతికేది ఎక్కడ? మానవుడు తన స్వస్వరూపమును విస్మరించాడు. ఆనందము నిమిత్తమై

బయటి ప్రపంచమందు ప్రాకులాడుతున్నాడు. అన్వేషణలు సల్పుతున్నాడు. ఇదియే అజ్ఞానము. తనకు కావలసిన ఆనందము తనయందే వుంటున్నది. భగవంతుని పరిపూర్ణముగా ప్రేమించి, భగవంతుని పరిపూర్ణ తత్త్వమును అనుభవించటమే ప్రేమ. అదే భక్తి. అట్టి ప్రేమ తత్త్వాన్ని అభివృద్ధి పరచుకొనే నిమిత్తమే ప్రార్థన అత్యవసరము. ఈ ప్రార్థన పెదవులనుండి ఉద్భవించిన ప్రయోజనము లేదు. హృదయమునుండి ఆవిర్భవించాలి. రావణుడు అనేక తపస్సులాచరించాడు. నిరంతరము పంచాక్షరీనామము, 'ఓంనమశ్శివాయ' అనే మంత్రాన్ని ఉచ్ఛరించేవాడు. కానీ, తన రాక్షస గుణము మారలేదు. కారణం ఏమిటి? ఉచ్ఛరించే నామము హృదయపూర్వకంగా రావటం లేదు. భగవదర్పితముగావించటం లేదు. భగవత్ప్రేమను ఏరీతిగా అందుకోగలడు? ఏదైనా ఒక దానిని మనం అందించినప్పుడే ఇంకోదాన్ని అందుకోటానికి అర్హులమౌతాము. ఒక షాపుకు వెళ్ళి పదిరూపాయల నోటు ఆ షాపుకీపరుకు యిచ్చినప్పుడే ఒక కర్చీఫ్ మనకు యిస్తాడు. నీవు పది రూపాయలు అందించనప్పుడు ఆ కర్చీఫ్‌ను అందించడు. ఉపనిషత్తులు ఎంత సులభంగా ప్రబోధిస్తూ వచ్చాయి. నీవు ప్రపంచమున లేనిది యేమీ అందించనక్కర లేదు.

పత్రమో పుష్పమో ఫలమో తోయమో భక్తి కలిగిన వానికి
వశుడవౌట సత్యమేని నీవు ఈ తులసీ ధళమునకు తూగుదువుగాక.

ఏ మారేడు పత్రమో, బిళ్వ పత్రమో కాదు. ఎక్కడ మారేడు చెట్టు వుంటున్నాది, ఎక్కడ బిల్వ చెట్టు వుంటున్నాది అని వెతకనక్కరలేదు. దేహమే మనకు పత్రము. పుష్పమో, ఈ పుష్పము ఏమిటి? ఈ పుష్పము నీవు ఎక్కడా వెతకనక్కరలేదు. హృదయపుష్పమే ఈ పుష్పము. కనుక, నీవు ఎక్కడా వెతకనక్కరలేదు. ఏ శ్రమకు నీవు గురికానక్కరలేదు. భగవంతునికి అర్పించే పుష్పము యేరీతిగా నీవు అర్పిస్తున్నావు? చిక్కిన పుష్పములంతా భగవంతునికి పూజ చేయటం లేదు. పుష్పమును తీసుకొని, ఆ పుష్పముపై వాలిన కామక్రోధమోహలోభమదమత్సరములనే క్రిములను తీసి చక్కగా పరిశుద్ధము చేసి భరవంతునికి అర్పించాలి. ఫలమే, మనోఫలము. ఆ మనోఫలము ఏరీతిగా వుండాలి? ఏదో చెట్టును కోసిన కాయలు కోసి యివ్వకూడదు. మంచి పరిపక్వ స్థితిలోపల మధురమైనవిగా వుండాలి. ఆ ఫలములో మాధుర్యము రావాలి. ప్రేమతో కూడిన ఫలము నీవు అందించాలి. తోయమో, tap water, ganges water, well water, river water కాదు. నీ ఆనంద బాష్పమే తోయము. దానికి నీవు శ్రమ పడనక్కరలేదు. అనేకమందిని మీరు చూచి వుంటారు. అమితమైన ఆనందము వచ్చినప్పుడు కంటినుండి నీరు కారుతుంది. అమిత దుఃఖమును పొందే సమయంలో కంటిలో నీరు రాదు. ఆ నీటినే నారములని ఉపనిషత్తులు చెబుతూ వచ్చాయి. నారములనే జలము నయనములతో నారాయణునకు అర్పితము చేయాలి. కన్నులకు నీరు రాకూడదు. ఎప్పుడు రావాలి? నారాయణునకు అర్పితము చేసినప్పుడు రావాలి. కనుక, మానవత్వములో దివ్యమైన ప్రపంచము యిమిడి వుంటున్నది. అదే అహంబ్రహ్మాస్మి. అయమాత్మాబ్రహ్మ. అదే తురీయవస్థ. ఇలాంటి భావము మనం నిరంతరము స్మరించినప్పుడు బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. తానే బ్రహ్మముగా మారిపోతాడు. దేహము కేవలము క్షేత్రమే. అయితే క్షేత్రజ్ఞుడు లోపలున్నాడు. గుడి లేక దేవుడు లేడు. కరెంటు లేని వైరు, నీరు లేని పైరు, పంతులు లేని బడి, దేవుడు లేని గుడి ఏమి ఉపయోగము! మనము ప్రపంచములో మధురమైన భావముతో పరమాత్మకు అర్పితము గావించాలి. కీర్తనం సంకీర్తనమని రెండు రకములుంటున్నాయి. కీర్తనములో స్వార్థము మాత్రమే వుంటుంది. అది వారి పేరుప్రతిష్ఠల నిమిత్తమై, మర్యాదల నిమిత్తమై ఆ కీర్తనలు పాడుతుంటారు. వారికి భావములేమాత్రమూ అక్కరలేదు. వారికి శ్రుతిలయరాగములు చేరుతే చాలు. కానీ, సంకీర్తనం, అది ఆనందమునందించేది. ఎట్లా? నీవు గొంతును చూచుకోవద్దు. పదిమంది వింటున్నారనే విచారము వద్దు. పరిపూర్ణ ప్రేమతో స్వేచ్ఛగా గానము చేయి. ఆ భగవత్ప్రేమతో నీవు గానము చేసినప్పుడు తనంతట తానే సుస్వరములో ప్రవేశిస్తుంది. మన దేశముయొక్క పరిస్థితియే ఆవిధంగా వుంటున్నాది. దేశము పేరే శ్రుతిలయరాగములతో కూడినది. భారత, భా భావ, ర రాగ, త తాళ భావరాగతాళ సమ్మిళితమే భారతం అన్నారు. మన సర్వ పనులు భావరాగతాళములతో కూడి వుంటున్నాయి. కానీ, హృదయానికి సంబంధము చేయాలి. కేవలం 'రాంరాం' అని పెదవులతో పలికితే టేపురికార్డు పలికినట్టు వుంటుంది. హృదయమునుండి ఆ భావము కలగాలి. అదే త్రికరణ శుద్ధి అన్నారు. thoughts, words, deeds ఈ మూడింటి ఏకత్వము కావాలి. the properstudy of mankind is man. అప్పుడే భగవంతుడు కదులుతాడు. కరుగుతాడు. భగవత్ప్రేను పొందే నిమిత్తమై, భగవదనుగ్రహము పొందే నిమిత్తమై మనము ప్రార్థన చేయాలి. అంతేగానీ పదిమంది మెప్పులకోసం కాదు. ఆవిధమైన సూక్ష్మభావాన్ని మనస్సులో నింపుకోవాలి.

లోకములో అనేక సమస్యలుంటున్నాయి. ఎక్కడ చూచినా అశాంతి. ఎక్కడ చూచినా అల్లకల్లోలములు.

ఎక్కడ చూచినా కలహములు. కారణం ఏమిటి? స్వార్థము మితిమీరిపోయింది. కీర్తిమర్యాదలు విస్మరించారు. మానవత్వమునే మరచిపోయారు. మానవతా విలువలను పూర్తిగా విస్మరించారు. కనుక, ఈనాడు ప్రతి పదార్థమునకు విలువ వున్నదిగానీ మనిషికి విలువ లేకపోతున్నాది. కానీ, మానవునికున్నంత విలువ ఎవ్వరికీ లేదు. మానవుడుగా జీవించాలి. విలువైన రత్నానికి విలువ ఎవరిస్తున్నారు? మానవుడే విలువ కడుతున్నాడు. విలువైన బంగారుకు ఎవరు విలువ కడుతున్నారు? మానవుడే విలువ కడుతున్నాడు. మానవుడే లేక డైమండ్‌కు విలువ లేదు. బంగారుకు విలువ లేదు. ఇంత విలువ యిచ్చే మానవునికి ఈనాడు విలువ తగ్గిపోయింది. ఈ సత్యాన్ని విద్యార్థులు చక్కగా గుర్తించి వర్తించాలి. men are more valuable than all the wealth of the world. బంగారు కాదు విలువైనది. డైమండ్ కాదు విలువైనది. మనిషి విలువైనవాడు. మనిషి నివసించే పట్టణములో గజమునకు యిన్ని వేల రూపాయలని విలువ యిస్తున్నాడు. అదే అడవికి పోతే పది రూపాయలిస్తే ఒక ఎకరా యిస్తారు. కారణం ఏమిటి? అక్కడ మనిషి సంచారం లేదు. మనుష్యులు లేని దగ్గర విలువ లేకుండా వుంటుంది. మనుషులున్న దగ్గరే విలువ పెరుగుతుంది. విలువ దేనివల్ల పెరిగింది? మనిషివల్ల పెరిగింది. ఈ సత్యము క్షణక్షణము మరచిపోకుండా చూచుకోవాలి. నేను విలువైన వాడను, నేను విలువైన వాడను, నేను గొప్పవాడను. అదే అహం బ్రహ్మాస్మి. నేను బ్రహ్మము అనుకుంటే అది మాత్రమే స్వార్థమైపోతుంది. దీనికి తదుపరి వేదాంతము చెప్పింది 'మమాత్మా సర్వభూతాంతరాత్మా' నా ఆత్మయే అందరియందు వుంటున్నది. అందువలన నిన్ను ఎదుటివాడు గౌరవిస్తున్నాడు. ఇదియే మొట్టమొదట కృష్ణుడు భగవద్గీతలో ప్రబోధించినది. నా ఆత్మయే నీవు, నీ ఆత్మయే నేను. రెండు ఆత్మలు లేనేలేవు. ఒక హాలులో నూరు మట్టి పాత్రలు పెట్టావు. పింగాణి పాత్రలు నూరు పెట్టావు. రాగి పాత్రలు నూరు పెట్టావు. ఇంకా అనేక లోహపాత్రలు పెట్టావు. అన్ని పాత్రలయందూ ఒకే సూర్యుని ప్రతిబింబము కనిపిస్తున్నాది. బంగారు పాత్ర వెల వేరుగా వుండవచ్చును. మట్టి పాత్ర వెల వేరుగా వుండవచ్చును. రాగి పాత్ర వెల వేరుగా వుండవచ్చును. కానీ, అన్నింటియందు కనిపించే ప్రతిబింబమునకు ఒకే విలువ.దేహమనే పాత్రలో, మనస్సు అనే జలములో ప్రతిబింబిస్తున్నాది ఈ ఆత్మతత్త్వము. మనస్సు కదిలినప్పుడు సూర్యుడు కదలినట్లు కనిపిస్తుంది. సూర్యుడు కదలడు. అతను ఎప్పుడూ కదలడు. కదిలేది మనయొక్క మనస్సే. మనస్సు కదలటంచేత దైవము కదిలినట్లుగా కనిపిస్తుంది. అనేకమంది అజ్ఞానులు, 'నా ఆత్మ చంచలంగా వుంటుంన్నాది' అంటారు. ఆత్మకు చంచలత్వమే లేదు. నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధబుద్ధముక్త నిర్మల స్వరూపిణం. అలాంటి ఆత్మతత్త్వమును చంచలత్వమని చెప్పుకోటం ఎంత అజ్ఞానము. కాదుకాదు. అది కదిలేది కాదు. మారేది కాదు. కరిగేది కాదు. కఠినమైనది కాదు. సర్వం మధురమైనది. రమ్యమైనది. ఆకర్షణీయమైనది. ఆనందమయమైనది. ఆహ్లాదమైనది. అంతా అమృతమయమైనది. అట్టి ఆత్మతత్త్వము నీవు గుర్తించుకోలేక కేవలము లౌకికము, భౌతికము, ప్రాకృతికమైన పదార్థముల నిమిత్తమై ప్రాకులాడుతున్నావు. దేహాన్ని ఆధారము చేసుకోవాలి. దేహము ద్వారానే దైవమును చూడాలి. దేహము ఒక రథము. రథము ద్వారానే ప్రయాణము చేయాలి. అయితే ఈ రథములో నీవు కూర్చొని డ్రైవ్ చేస్తున్నావు. కానీ, ఆ రథము నీవు కాదు. రథమునకు నీవు డ్రైవరు మాత్రమే. రథము వేరు, డ్రైవరు వేరు. దేహము రథము. ఈ రథము నేనే అని భావిస్తున్నావు. కాదు. ఈ రథమును తోలే డ్రైవరు ఒకడున్నాడు. స్టీరింగు, ఏక్సలరేటరు అన్నీ అతని అధీనమునందే వుంటాయి. ఈ రథమునకు ధర్మార్థకామమోక్షములనే నాలుగు పురుషార్థములు టైర్సుగా వుంటున్నాయి. నాలుగు టైర్సులో గాలి వుండాలి. ఈ గాలి ఏమిటి? అదే విశ్వాసము. అన్నింటియంది నమ్మకముండాలి. ఇక్కడ మనస్సు స్టీరింగు. బుద్ధి స్విచ్. స్టమక్ ఇంజను. మనము తినే ఆహారమే దీనికి పెట్రోలు. టిఫిన్ దీనికి ఆయిల్. ఎక్కడకు ప్రయాణం చేయాలి అంటే అక్కడ మనస్సును టర్న్ చేయాలి. టైర్సు బయట వున్నాయి. తిరిగే టైర్సు మనకు కనిపిస్తున్నాయి. కానీ, లోపల తిప్పే స్టీరింగు అతని చేతిలో వుంటున్నాది. ఎట్లా నీవు పోవాలంటే ఆ వైపు స్టీరింగు తిప్పుతే ఆ టైర్లు అట్లా వెళ్ళిపోతాయి. ధర్మార్థకామమోక్షములు జడమైన టైర్సు మాత్రమే. అయితే ఈ టైర్సులో విశ్వాసమనే గాలి వుండాలి. అప్పుడే ఈ టైర్సు సరైన మార్గములో నడుస్తాయి.

విద్యార్థులారా! కారు కదాయని ఎట్లాఅంటే అట్లా రోడ్డుపైన ప్రవేశపెట్టకూడదు. ఆ రోడ్డుయొక్క ఎత్తుపల్లములు గుర్తించుకొని నీవు ప్రయాణము చేయాలి. మన దేహాన్ని సమాజములో ఏ పరిస్థితియందు, ఏ ప్రభావమునందు, ఏ వయస్సునందు ఏవిధముగా నడచుకోవాలిఅనే నిత్యానిత్యవిషయమును పరిశీలన చేసి జీవించుటకు ప్రయత్నించాలి. కారు అని ఎట్లా అంటే అట్లా డ్రైవ్ చేయటానికి వీలులేదు. పెద్దల దగ్గర ఏవిధంగా వినయంగా వుండాలి? టీచర్సుకు

ఏవిధంగా గౌరవమునందించాలి? తల్లిదండ్రులను ఏవిధంగా ప్రేమించాలి? దైవాన్ని ఏవిధంగా ప్రార్థించాలి? మన ఉద్యోగము ఏవిధమైన మార్గములో అభివృద్ధి చేయాలి? కర్తవ్యము ఏవిధంగా నిర్వర్తించాలి? ఈవిధమైన దీనిని డిస్‌క్రిమినేషన్‌తో గుర్తించినప్పుడే ప్రమాదము లేకుండా చక్కగా రాజమార్గములో ప్రవేశిస్తుంది. దీనికి ఆహారము కావాలి. తగిన ఆరోగ్యము వుండాలి. సరైన శక్తిసామర్థ్యములు కలగాలి.

దేహము ఎంతో పవిత్రమైనది. భగవంతుని చూపేది దేహమే. శరీరము ఒక దేవాలయము వంటిది. శరీరము ఒక రథము వంటిది. శరీరము ఒక క్షేత్రము వంటిది. అదికూడా 'నేను' అన్నాడు కృష్ణుడు. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః' దేహము ఒక పెద్ద దేవాలయము. ఈ దేవాలయము ఎంత పవిత్రముగా చూస్తామో అప్పుడు దైవముయొక్క పవిత్రత కూడా కొంత అభివృద్ధి పొందుతుంది. అయితే దేహమును దైవ విషయములో అర్పితము చేయాలి. ఏ కార్యము చేసినా దైవకార్యముగా విశ్వసించాలి. ఎక్కడ నీవు ప్రయాణము చేస్తున్నా దైవము వైపుకు ప్రయాణం చేస్తున్నాననుకో. కారణం ఏమిటి? విశ్వం విష్ణుమయం. జగత్తంతా భగవంతుని స్వరూపమే. తాను లేని స్థానముకానీ, తనదికాని నామముగానీ జగత్తులో కానరాదు. 'సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షిశిరోముఖం సర్వతః? అంతా తానే అయి వున్నాడు.

ప్రేమస్వరూపులారా! నేను జీవుడు, తాను దేవుడు అనే భావము వున్నంత వరకు జీవుడు జీవుడే, దేవుడు దేవుడే. జీవుడే దేవుడనే పరమ విశ్వాసాన్ని మనము పెంచుకోవాలి. దేవుని జీవుని ప్రత్యేకము చేయకూడదు. ఈవిధమైనవి మనం చేయటం వలన అశాంతికి గురైపోతున్నాము. ఆ ఏకాత్మ భావము విశ్వసించాలి. నీవు చేయ వలసిన పనులు నీవు చేసుకో తప్పు లేదు. దైవభావముతో చేసినప్పుడు అక్కడ ఏ దోషములు కలుగవు. 'దైవము నాలో వున్నాడు' అనుకున్నప్పుడు ఏమాత్రమూ దోషమునకు పాల్పడవు కదా! ఇతరులను యేమాత్రమూ హింసించవుకదా. ఇతరులను బాధించవుకదా. కారణం ఏమిటి? దైవం ప్రేమస్వరూపం. ప్రేమ ఎక్కడ వుంటున్నాదో అక్కడ ఎవరికీ హింస కలుగదు. ఆ ప్రేమ లేని హృదయములోనే ద్వేషము ప్రవేశిస్తుంది. ప్రేమ లేని హృదయములోనే ద్వేషము ప్రవేశిస్తుంది. ద్వేషము ప్రవేశించినప్పుడే దుర్మార్గమైన క్రియలలో ప్రవేశించేది.

విద్యార్థులారా! అందరూ ఐకమత్యముగా, అన్యోన్యముగా, ప్రేమభావముతో ఏకాత్మభావము ప్రతిష్ఠించుకోవాలి. ఆ యూనిటీ చేరినప్పుడే మన హృదయము ప్యూరిటీగా వుంటుంది. ఈ యూనిటీ లేనప్పుడు ఆ స్థానము ఖాళీగా వుంటుంది. తక్షణమే ఎనిమిటీ వచ్చి ప్రవేశిస్తుంది. ఈ ఎనిమిటీ ప్రవేశించక పూర్వమే డివినిటీలో మనం చేరిపోవాలి. కానీ, దురదృష్టవశాత్తు ఈనాడు no unity, no purity, no divinity, only community, enimity ఈ రెండూ మాత్రమే అభివృద్ధి అవుతున్నాయి. ఎనిమిటీ ఎంత చెడ్డది చెప్పండి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికీ నమస్కారం చేయాలి. కారణం? అందరియందున్న దైవము ఒక్కడే. ఇలాంటి ఏకాత్మభావంచేత మానవుడు దైవత్వాన్ని పొందవచ్చు. ఈ ఏకాత్మభావము ఎప్పుడు మనము విస్మరిస్తామో అప్పుడే పశువుగా మారిపోతాం. మనము పశువునుండి వచ్చాము, తిరిగి మనము వెనుకకు పోకూడదు. ముందుకు పోవాలి. ఈవిధమైన జీవితము గడుపుకొని జగత్తుకు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుకావాలి. ఈనాడు లోకములో అనేకమంది ధనమునకు, అధికారమునకు బానిసలౌతున్నారు. అహంకారమునకు బానిసలౌతున్నారు. కీర్తిప్రతిష్ఠలకు బానిసలౌతున్నారు. కానీ, మన విద్యార్థులు దానికి కాదు బానిసలు కావలసినది. ఆదర్శమునకు బానిసలు కావాలి. అదే మనము ఈనాడు నేర్చుకోవలసినది. ఎటువంటి ఆదర్శములు? శక్తివంతమైనవి. పరులకు అనుకూలము చేసేవి. పరులకు ఆనందము కలిగించేవి. అవే సరైన ఆదర్శములు. ఉత్తమమైన ఆదర్శములనందించాలి. ఆ ఒక్క పేరు తెచ్చుకుంటే చాలు. తల్లిదండ్రులుఆనందిస్తారు. సమాజము ఆనందిస్తుంది. సమాజములో ఒక వ్యక్తి చక్కగా వుంటే సమాజముకూడా చక్కగా అయిపోతుంది.

విద్యార్థులారా! మీరు ఈ లేత వయస్సునందే నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తులను మీలో ప్రవేశపెట్టుకొని ఆదర్శవంతమైన విద్యార్థులుగా మీరు తయారుకావాలి. అదే అన్ని పురాణముల సారము. help ever, hurt never. ఈ రెండింటిని మనం దృష్టియందుంచుకుంటే మనము జగత్తుకు అన్ని సేవలు చేసినవారమౌతాము. కేవలం నీ యింటికి చేసుకోటం కాదు. జగత్తంతయు దైవస్వరూపకముగా మనం భావించాలి. ఆ దైవముయొక్క ప్రేమకు పాత్రులయ్యే విధానము మనము తెలుసుకోవాలి. 'దైవమా! నన్ను రక్షించు' ఇది కాదు ప్రార్థన. 'అఖండమైన భగవత్ప్రేమను అనుభవించాలి' అదే ప్రార్థన. అది ఒక్కటి వుంటే ఏ కొరతా వుండదు. అదే త్యాగరాజు చెప్పాడు, 'రామా! నీ అనుగ్రహ బలము ఒక్కటి వుంటే నవగ్రహములు ఏమిచేస్తాయి?' అన్నాడు. ఎందుకోసం కన్నులనిచ్చావని తులసీదాసు

బాధ పడ్డాడు. 'కనులేలరా! రాముని చూడని కన్నులేలరా! కంటిచూపేలరా! ' కేవలము నేను అంగహీనుడను అన్నాడు. చేతులున్నాయి, కాళ్లున్నాయి, కన్నులున్నాయి. ఎందుకు అంగహీనుడంటున్నావు? అప్పుడు చెప్పాడు తులసీదాసు, 'చేతులున్నాయి కానీ సేవలు చేయలేకపోతున్నాను. కాబట్టి అంగహీనమే. చేతులు లేనివాడనే. కన్నులున్నాయి కానీ చూడలేకపోతున్నాను కాబట్టి గుడ్డివాడనే. చెవులున్నాయి కానీ వేణుగానము వినలేకపోతున్నాను. కాబట్టి అంగహీనుడనే'. ప్రతి అంగము భగవత్ప్రీత్యర్థమై , భగవంతుని ఆనందము అనుభవించే నిమిత్తమై సద్వినియోగం చేయాలి. అదే మానవత్వములోనున్న గొప్ప విశిష్టత. సౌజన్యత, సౌశీల్యత యిందులోనే వుంటున్నాయి. అందువలనే త్యాగరాజు ప్రేమతో పిలిచాడు.

రార మా యింటిదాక రణధీర సుకుమార నీకె మ్రొక్కెద
రారా దశరథకుమారా! నన్నేలుకోరా! తాళలేను...

ఒకవైపున నిన్ను విడచి నేను వుండలేనని అంటున్నాడు. ఒకవైపున 'రారా' అని పాత స్నేహితుని మాదిరి సంభాషణ చేస్తున్నాడు. ఆధ్యాత్మిక మార్గములో ఏకవచనము తప్ప బహువచనము లేదు. భగవంతుని ఏకవచనముతోనే పిలుస్తున్నాడు. కారణం ఏమిటి? పాతవారినే 'రారా' అంటాము. కొత్తవారిని 'రండి, దయచేయండి' అంటాము. నూతన పదాలు వుపయోగపెడతాము. పాతవారిలా ఫ్రీగా వుండాలి. the end of wisdom is freedom, the end of culture is perfection, the end of knowledge is character. అదే friendiship. భగవంతుని స్వంతవానిగా నీవు అనుభవించాలి. 1 వున్నాది. 9 వున్నాది. ఏ నెంబరు పెద్దదని పిల్లలను అడిగితే చదువురానివాడు కూడా 9 పెద్దది అంటాడు. కాదుకాదు. 1 పెద్దది. 1 కి 1కి కలుపుతూ పోతుంటే 9 అవుతుంది. 1 లేక 9 లేదు. 1 హీరో. వరల్డు జీరో. దైవమును మరచినప్పుడు హీరోకూడా జీరో అయిపోతాడు. మనము హీరోగా తయారు కావాలి. ప్రేమచేత హీరో తత్త్వమును అనుభవించటానికి ప్రయత్నించాలి.

ప్రేమముదిత మనసె కహో రామరామరాం......